సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 4 । జనవరి । 2024



ఆరోగ్యానికి రక్ష

జిల్లాలో రెండో రోజూ జగనన్న ఆరోగ్య సురక్ష.. శిబిరాలకు విశేష స్పందన లభించింది. 1337 మందికి సేవలందాయి. - 8లో



స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయి పూలే

సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలని వక్తలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. - 8లో

జానపద కథల పోటీలకు ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస మండలం రంగోయి గ్రామంలో గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం , బద్రి అప్పన్న స్మారక కళాపీఠం 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 7న జానపద కథలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు కళా పీఠాల వ్యవస్థాపకులు బద్రి కూర్మారావు ఒక ప్రకట నలో తెలిపారు. వివరాలకు 9704798643 నం బర్‌ను సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

సరిహద్దు ప్రాంతాల్లో చెక్‌పోస్టులు



పాతపట్నం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ రామారావు, సిబ్బంది

పాతపట్నం: ఆంధ్ర–ఒడిశా సరిహద్దులో పాత పట్నం, మెళియాపుట్టి మండలం వసుంధర, కొత్తూరు మండలం మాతల వద్ద బుధవారం నుంచి చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహన తని ఖీలు చేపడుతున్నామని పాతపట్నం సీఐ ఎం. వినోద్‌బాబు తెలిపారు. పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ సరిహద్దు చెక్‌పోస్టులో బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలి పారు. ఒక్కో చెక్‌పోస్ట్ వద్ద ఎస్‌ఐ, నలుగురు కానిస్టేబుళ్లను నియమించామని చెప్పారు. సరిహద్దు ప్రాంతంలో ప్రయాణించే వాహనచో దకులు తప్పనిసరిగా వాహనపత్రాలు అం దుబాటులో ఉంచుకోవాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎస్‌ఐ టి.రామారావు, పోలీసులు పాల్గొన్నారు.

సలాం సైనికా..!



ధనుంజయ్‌ను ఊరేగిస్తున్న గ్రామస్తులు

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామానికి చెందిన దారపు ధనుంజయ్ భారత సైన్యం లో(ఆర్మీ) ఎనలేని సేవలు అందించి హవల్దార్ కేడర్‌లో ఉద్యోగ విరమణ పొందారు. ఈ సం దర్భంగా కుటుంబసభ్యులు, గ్రామస్తులు బుధవారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగించి ధనుంజయ్ సేవలను కొనియాడారు.

పొందూరు ఖద్దరుకు 'ఓడీ ఓపీ' అవార్డు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వన్ డిస్ట్రిక్ట్ వన్ అవార్డుల్లో భాగం గా శ్రీకాకుళం జిల్లాలోని పొందూరు ఖద్దరు, కాటన్ చీరకు అవార్డు వరించింది. ఈ మేరకు ఢిల్లీలో బుధవారం నిర్వహించిన ఓడీఓపీ అవా ర్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర విదే శాంగ శాఖ మంత్రి సుబ్రహ్మణ్యం జయశంకర్, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ చేతుల మీదుగా కలెక్టర్ శ్రీకేష్ బి.లా ఠకర్ అందుకున్నారు. జిల్లాకు అవార్డు రావడం పట్ల నాయకులు, అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

పారదర్శకంగా ఫిర్యాదుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజకీయ పార్టీలు అందించే వినతులు, ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని, ఇందులో ఒకరు ఎక్కువ.. మరొకరు తక్కువనే ప్రశ్నే లేదని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణప తిరావు స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాకు సం బంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధు లతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ సార్వత్రిక ఎన్నికల కోసం పూర్తిస్థాయి ఓటర్ల తుది జాబితాను జనవరి 22న విడుదల చేస్తామన్నారు. ఫారం 6, 7, 8 లకు సంబంధిం చిన తుది పరిశీలన పూర్తయిందని చెప్పారు. ఈ నెల 12 నాటికి అన్ని అన్ని స్థాయిల్లో క్లెయిములకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కోరినట్టుగానే డబుల్ ఎంట్రీ, పోలింగ్ బూత్‌ల వారీగా బం దోబస్తు తదితర అంశాలపై నివేదిక అంద జేస్తామన్నారు. సమావేశంలో నాయకులు రౌతు శంకరరావు, పి.ఎం.జె.బాబు, గోవింద మల్లిబాబు, జి.రామారావు, సీ–సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు పాల్గొన్నారు.

జీవితాంతం గుర్తుంచుకుంటా

నేను పదో తరగతి వరకు చదివాను. పుట్టుకతోనే మరుగుజ్జుత నం, పేదరికం కారణంగా ఉన్నత చదువు చదవలేకపోయాను. కుటుంబానికి భారం అవుతున్నానన్న ఆలోచన నిత్యం ఉండేది. గతంలో ఎన్నోసార్లు పింఛన్ కోసం దరఖాస్తు చేశాను. ఒకానొక సమయంలో మంజూరు కాదనుకున్నాను. ఇలాంటి పరిస్థితిలో మా వలంటీర్ వచ్చి దివ్యాంగురాలిగా గుర్తింపు కోసం దరఖాస్తు చేయించి సచివాలయం ద్వారా నా పేరును పింఛన్‌కు అర్హురాలి జాబితాలో పెట్టించారు. ఇప్పుడు పెన్షన్ అందడం ఆనందంగా ఉంది. సీఎం జగన్‌ను జీవితాంతం గుర్తుంచుకుంటాను.

– చౌత గౌతమి, దివ్యాంగురాలు, చీడివలస, పోలాకి మండలం





శ్రీకాకుళంలో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, అంధవరపు సూరిబాబు, అధికారులు

పింఛనానందం!

ఇక పింఛన్ రూ.3వేలు

- 16 రకాల పింఛనుదారులకు ఇక నో టెన్షన్
- జిల్లాలో 3,23,436 మందికి రూ.94.52 కోట్లు విడుదల
- బతుకులకు భరోసానిస్తున్న సీఎం జగన్: మంత్రి ధర్మాన

శ్రీకాకుళం పాతబస్టాండ్/పోలాకి/శ్రీకాకుళం/ సోంపేట: ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ.3వేలకు పెంచ డంతో సర్వత్రా ఆనందం వెల్లివిరుస్తోంది. బుధవారం కాకినాడలోని రంగరాయ వైద్య కళా శాల మైదానంలో పెన్షన్ కానుక పెంపు కార్యక్రమం ప్రారంభించగా, జిల్లాస్థాయిలో బాపూజీ కళామం దిర్‌లో కార్యక్రమాన్ని వీక్షించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరయ్యారు. పెంచిన పింఛను కానుక నమూనా చెక్కును లబ్ధిదా రులకు అందజేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మాట్లాడుతూ పెన్షన్లు రూ.2750 నుంచి రూ.3000కు పెంచినట్లు తెలిపారు. జిల్లాలో 3,23,436 మందికి రూ.94.52 కోట్లు అందుతుం దని చెప్పారు. కొత్తగా 9619 పెన్షన్లు మంజూ రయ్యాయని వివరించారు. వివిధ కేటగిరీలకు చెం దిన 16 రకాల పింఛన్లు అందిస్తున్నట్లు వివరిం చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి లబ్ధిదా రుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లా డుతూ ఏ రాష్ట్రంలోనూ రూ. 3వేల పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు. జగనన్న పాలనలో అన్ని వర్గాల వారికి సమన్యాయం జరుగుతోందని చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ మాట్లాడుతూ జిల్లాలో కొత్తగా 9619 పెన్షన్లు మంజూరు చేసి ఈ నెల నుంచే పెం చిన మొత్తం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్ర మంలో పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్ హైమా వతి, సుడా డైరెక్టర్ కోరాడ ఆశాలత, వైఎస్సార్ సీపీ నేత రౌతు శంకరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



నందిగాం: హరిదాసుపురంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పింఛన్ లబ్ధిదారులు

దేశంలో ఎక్కడా లేదు..

ఇంత స్థాయిలో పెన్షన్ పెంపు దేశ చరిత్రలో ఎక్కడా లేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే ఇది సాధ్యమైంది. ఈ నెల నుంచే పెం పు అమల్లోకి వస్తుంది. సంక్షేమ పాలన వలన లబ్ధిదారులకు ఎంతో మేలు జరుగుతుంది.

– రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

పింఛన్‌తో భరోసా

పారదర్శకమైన పాలన ద్వారా ప్రజలకు సం క్షేమ పథకాలు అందిస్తున్నాం. అర్హతే ప్రామాణి కంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నాం. అర్హు లైన వారికి వలంటీర్లు తెల్లవారుజామునే తలు పులు తట్టి పెన్షన్ అందిస్తున్నారు. కష్టపడలేని స్థితిలో ఉన్న వారికి వైఎస్ఆర్ పెన్షన్ కానుక భరోసాగా నిలుస్తుంది.

– ధర్మాన ప్రసాదరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి

ఊహించలేదు..



నూతన పెన్షన్ కోసం రెండు నెలల క్రితం మా ఇంటి వద్దకు వచ్చిన వలంటీర్‌కు దరఖాస్తు అందజే శాను. పరిశీలించిన అధికారులు వెంటనే పెన్షన్ మంజూరు చేశారు. ఇంత తక్కువ వ్యవధిలో పింఛన్ మంజూరవుతుందని ఊహించలేదు. మూడు వేలు పెన్షన్ అంద జేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాను.

– తూముల ఈశ్వరరావు, వృద్ధాప్య పెన్షన్‌దారుడు, సోంపేట

రుణపడి ఉంటాం..



నాకు ప్రతి నెలా ఒంటరి మహిళ పిం ఛన్ డబ్బులు అందుతున్నాయి. ఈ నెల నుంచి రూ.3వేలు వస్తుందని సీఎం జగనన్న చెప్పడం ఆనందంగా ఉంది. ఈ డబ్బులు నాకు ఎంతో ఆధారంగా నిలుస్తున్నాయి. నా పిల్లలు ఇద్ద రినీ జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన పథకాల ద్వారా చదివించుకుంటున్నాను. జగనన్న కాలనీ ఇల్లు కూడా మంజూరైంది. ఎన్నికల ముందు జగనన్న మాటలు ఇప్ప టికీ గుర్తున్నాయి. ఇచ్చిన మాట కంటే ఎక్కువ చేశారు. జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– పతివాడ విజయలక్ష్మి, ఒంటరి మహిళ, నానుబాలవీధి, శ్రీకాకుళం



అర్హతే ప్రామాణికంగా..

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. అవ్వతాతలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3000కు పెంచారు. నిరు పేదల ముఖాల్లో వెలుగులు నింపారు.

– తమ్మినేని సీతారాం, స్పీకర్ (ఆమదాలవలసలో నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో)



సంక్షేమ ప్రదాత..

పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. ప్రతి కుటుంబానికి మేలుకలిగించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పిం ఛన్ నగదు మూడువేలుకు పెంచి అవ్వ, తాతల ముఖాల్లో చిరునవ్వులు నింపారు. ముఖ్యమంత్రికి అవ్వతాతలు అండగా నిలవాలి.

– పిరియా విజయ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ (సోంపేటలో జరిగిన పింఛన్ల పంపిణీలో..)



జగన్ ధైర్యం జనమే..

రాష్ట్రంలో జగన్ సునామీ కొనసాగుతోంది. ఆయన ధైర్యం జనమే. జగన్‌ను వచ్చే ఎన్నికల్లో ఎదుర్కోవటం చంద్రబాబు అండ్ కో కు సాధ్యం కాదు. పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన చిత్తశుద్ధి కలిగిన ప్రజానాయకుడు కాబట్టే ఆయనకు ప్రజలపై అంతనమ్మకం.

–ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు (పోలాకిలో జరిగిన పింఛన్ల పంపిణీలో..)



మాట నిలబెట్టుకున్నారు..

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నేతగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల ఆదరాభిమానాలు పొందారు.కులం,మతం, వర్గం, పార్టీ చూడకుండా అర్హులకు ప్రభుత్వ పథకాలు అందజే సిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదే. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నిలబెట్టుకున్నారు.

–గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే (ఎచ్చెర్లలో నిర్వహించిన కార్యక్రమంలో..)



నియోజకవర్గం	ఇచ్ఛాపురం	పలాస	టెక్కలి	పాతపట్నం	నరసన్నపేట	శ్రీకాకుళం	ఆమదాలవలస	ఎచ్చెర్ల
పింఛన్‌దారులు	45,075	36,592	43,505	41,784	39,522	35,371	37,012	44,575
మొత్తం	రూ. 13.35 కోట్లు	రూ.10.82 కోట్లు	రూ.12.69 కోట్లు	రూ.12.31 కోట్లు	రూ. 11.49 కోట్లు	రూ.10.39 కోట్లు	రూ.10.72 కోట్లు	రూ.12.75 కోట్లు

డ్వాక్రాబజార్ ప్రారంభం




అధికారులతో కలిసి స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వయం సహాయక బృం దాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులకు తగిన చేయూత నివ్వాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపునిచ్చారు. జిల్లా గ్రామీ ణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాబార్డ్, యూని యన్ బ్యాంక్ సౌజన్యంతో శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ పురపాలక పాఠశాల మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన సిక్కోలు డ్వాక్రా బజార్ – 2024ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా రుణాల మాఫీ నాలుగు విడ తల్లో పూర్తి చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేన న్నారు. సంప్రదాయ చేతివృత్తుల వారికి మార్కెటిం గ్ చేసుకునే ఆర్థిక స్తోమత ఉండదని, అలాంటి వారికి డ్వాక్రా బజారు వేదికగా నిలుస్తుందన్నారు. వస్తువులను ప్రదర్శించడంతో పాటు విక్రయించేలా ఏర్పాట్లు చేసిన నాబార్డు ప్రతినిధులను అభినందిం చారు. వారం రోజుల పాటు జరిగే ఈ డ్వాక్రాబజా రును ప్రతి ఒక్కరూ సందర్శించి మహిళలు ఆర్థికం గా ఎదిగేందుకు తోడ్పాటునందించాలని కోరారు.

కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డాక్టర్ డి.వి.విద్యాసాగర్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్య కిరణ్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి కె.చెన్న కేశవరావు, జిల్లా పౌర సంబంధాల అధికారి బాల మాన్ సింగ్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం.కృష్ణవేణి, చల్లా అలివేలు మంగ, రౌతు శం కరరావు, టి.కామేశ్వరి, మహ్మద్ రఫీ, మండవల్లి రవి, గుంట జ్యోతి, బాలకృష్ణ, బొడ్డేపల్లి పద్మజ తది తరులు హాజరయ్యారు.

సెక్టార్ అధికారుల విధులు కీలకం



మాట్లాడుతున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో నియమితులైన సెక్టార్ అధికారులు (ఇన్‌చార్జిలు) ఎన్నికల విధుల్లో బాధ్యతగా పనిచేయాలని ఎస్పీ జి.ఆర్.రాధిక సూచించారు. సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎన్నికల విధివిధానాలకు సంబంధించి జిల్లాలో పని చేస్తున్న ఎస్‌ఐ, సీఐ స్థాయి అధికారులతో జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెక్టార్‌కు కేటాయించిన అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని ఉన్నతాధికారులకు చేరవేయాలన్నారు. ప్రతీరోజూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలన్నారు. నాలు గున్నరేళ్లలో జరిగిన ముఖ్య కేసులు, గత ఎన్నికల కేసులను సమీక్షించి పాత ముద్దాయిలను బైండో వర్ చేయాలని సూచించారు. ఆయా కేసుల పట్ల సందేహాలుంటే లీగల్ అడ్వైజర్‌ను సంప్రదిం చవచ్చని పేర్కొన్నారు. ఇతర విభాగాల సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలన్నారు. వీలైనంత తొం దరగా అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటుచేసి నిరం తరం వాహనాల తనిఖీ చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) జె.తిప్పే స్వామి, జిల్లా పోలీస్ లీగల్ అడ్వైజర్ ఎం.యామినీ రాణి పాల్గొన్నారు.

పనస అధరహో!

- ఉద్దానం పనసకు రికార్డు స్థాయిలో ధర
- కిలో రూ.30 పలుకుతుండటంతో మార్కెట్ కళకళ

వజ్రపుకొత్తూరు: ఉద్దానం పనస రికార్డు ధర పలుకు తోంది. లేలేత పనసకాయలను రైతులు చెట్ల నుంచి కోస్తున్నారు. వీటికి గతంలో ఎన్నడూ లేనంతగా కిలో రూ.30 ధర పలుకుతోంది. దీంతో పలాస మార్కెట్‌కు పూండి నుంచి రైతులు పెద్ద ఎత్తున పన సకాయలను తరలిస్తున్నారు. సంక్రాంతి, హోలీ పం డగలకు పనసకాయలకు గిరాకీ ఉంటుందని రైతులు నూకల తులసీరావు, రాజారావు తెలిపారు. ప్రస్తుతం పలాస ఉద్దానం ప్రాంతంలో కొన్ని చోట్ల పిందె దశలో ఉండగా.. పూండి ఉద్దానం ప్రాంతం లో చెట్లకు గుత్తుగుత్తులుగా విరగకాశాయి. పూండి ఉద్దానం నుంచి రెండు రోజులుగా దాదాపు 20 టన్నుల పనసకాయలను పలాస మార్కెట్‌కు తర లించారు. అక్కడి నుంచి ఒడిశా, కోల్‌కతా వంటి ప్రాంతాలకు రవాణా చేస్తారు. అక్కడ కిలో రూ.60 వరకు ధర ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. కాగా ఏటా ప్రారంభంలో పలుకుతున్న ధర ఒక్కసారిగా రూ.10 నుంచి రూ.17 వరకు పడిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుతం ఉన్న ధర నిల కడగా ఉంటే పనస రైతు పంట పండినట్టే.



పలాస మార్కెట్‌కు తరలివెళ్తున్న పనసకాయలు



ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు




విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిపో అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం –1 డిపో పరిధిలోని వివిధ మార్గాల్లో నడుపుతున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణం చేసిన వారికి బుధవారం డిపో మేనేజర్ మల్లికార్జునరావు బహుమతులు అందిం చారు. డిసెంబరు 16 నుంచి 31 వరకు ఆమదాలవ లస, చీపురుపల్లి, బందరువానిపేట, సాలూరు రూట్లలో ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం కింద వీటిని అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ వేదుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోజంతా బావిలోనే..

టెక్కలి రూరల్: మండలంలోని వీరరామకృష్ణ పురం గ్రామ సమీపంలోని నేలబావిలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో రోజంతా బావిలోనే ఉం డిపోవాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. టెక్కలి ఆదిఆంధ్రవీధికి చెందిన ఉర్జాణ శంకరరావు మం గళవారం సాయంత్రం 5 గంటల రామకృష్ణా పురం వైపు వస్తుండగా ప్రమాదవశాత్తు నేలబా విలో పడిపోయాడు. నీరు ఎక్కువగా ఉండటం, బయటకు వచ్చే అవకాశం లేకపోవడంతో తనను కాపాడాలంటూ పెద్దగా కేకలు పెట్టాడు. ఆ ప్రాం తం నిర్మానుష్యంగా ఉండటంతో ఎవరికీ వినిపిం చలేదు. దీంతో రాత్రంతా పీకల్లోతు నీటిలో చలి లోనే ఉండిపోయాడు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అటువైపుగా వెళ్లిన స్థానికులకు అరుపులు వినబడడంతో వెంటనే వెళ్లి చూడగా శంకరరావు కనిపించాడు. అనం తరం పోలీసులకు సమాచారం అందించారు. టెక్కలి ఎస్‌ఐ–2 రమేష్‌బాబు, అగ్నిమాపక సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని తాళ్ల సాయంతో బయటకు తీశారు. ప్రథమ చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలిం చారు.



బావిలో పడిన శంకరరావు

కొండచిలువ హతం



హతమైన కొండచిలువ

వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి బోడిమెట్టపై సుమారు పది అడుగుల కొండచిలువ బుధవారం హల్‌చల్ చేసింది. ఇదే ప్రాంతంలో గొర్రెలమందలు ఉండటంతో వాటిని రక్షించే క్రమంలో స్థానికులు కర్రలతో కొట్టి కొండచిలువను హతమార్చారు.

జగనన్న సురక్ష ఆరోగ్యానికి రక్ష

- రెండో రోజూ విశేష స్పందన
- ఉచిత వైద్య సేవలందుకున్న 1337 మంది

అరసవల్లి/ఇచ్ఛాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత రెండో రోజు కూడా అదే స్పందన కొనసాగింది. జిల్లాలో బుధవారం నాలుగు మున్సిపల్ ప్రాంతాల్లో ఉన్న వార్డు సచివాలయాల పరిధిలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో ఆదివారంపేట, డీసీసీబీ కాలనీ, పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలోని సూదికొండ, ఇచ్ఛాపురం మున్సిపాల్టీలోని పురుషోత్తంపురం యూపీహెచ్‌సీ పరిధిలోని వార్డు సచివాలయాల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉచిత వైద్య పరీక్షల శిబిరాలు నిర్వహించారు. 1337 మంది పట్టణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య సేవలు పొందారు. ఈజేఏఎస్-2 ఉచిత వైద్య శిబిరాల్లో మొత్తం నలుగురు వైద్యుల బృందం ఆధ్వర్యంలో రోగులకు ఉచితంగా ఏడు రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా 172 రకాల మందులను పంపిణీ చేశారు. ప్రతి మెడికల్ క్యాంపులోనూ ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు, ఒక మెడికల్ ఆఫీసర్, ఒక ఆప్తాలమిక్ వైద్యునితో కలిసిన బృందం ఆధ్వర్యంలో బీపీ, షుగర్, హిమోగ్లోబిన్, టి.బి, మలేరియా, టైఫాయిడ్‌ల నిర్ధారణకు రక్త పరీక్షలు, థైరాయిడ్ వంటి ఏడు రకాల పరీక్షలు నిర్వహించారు. ప్రత్యేకంగా కంటి వైద్య పరీక్షలు కూడా చేయించారు. ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో పురుషోత్తపురం ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, 1వ వార్డు కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, కౌన్సిలర్లు చాట్ల పుష్ప, బచ్చు జగన్నాథం, కో-ఆప్షన్ మెంబర్ సుల్తానాబేగం, పట్టణాధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్, వైద్యులు ఎస్.అనూష, పి.దేవేంద్ర రెడ్డి, ఎం.అకిల్ మనోహర్, బి.శ్రీకన్య, ఆర్.శ్రీను పాల్గొన్నారు.



శ్రీకాకుళం సానావీధి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వైద్య శిబిరాలు	4
ఓపీ రిజిస్ట్రేషన్లు:	1337
రిఫరల్ రోగులు:	06
మందుల పంపిణీ:	1337
కళ్లకు స్క్రీనింగ్:	84



ఇచ్ఛాపురం: వైద్యపరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

పేదలకు వరం..



గ్రామంలో ఆరోగ్యసురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నారని వలంటీర్ చెప్పడంతో వచ్చాను. వైద్యులు మా సమస్యలు తెలుసుకొని అవసరమైన రక్తపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం మాలాంటి పేదప్రజలకు వరంలా మారింది.

– కె.ప్రమీల, 1వ వార్డు, పురుషోత్తపురం, ఇచ్ఛాపురం మున్సిపాలిటీ

స్ఫూర్తిప్రదాత సావిత్రిబాయి పూలే



కంచిలి: కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న టీచర్లు, గ్రామస్తులు



కత్తివరంలో సావిత్రిబాయి పూలే వేషధారణలో విద్యార్థిని లక్ష్మి ప్రసన్న



కాశీబుగ్గ: సత్కారం అందుకున్న పలాస ఇంటర్, డిగ్రీ మహిళా అధ్యాపకులు

మహిళా విద్యాభ్యున్నతికి విశేష కృషి చేసిన సావిత్రిబాయి పూలే చిరస్మరణీయురాలని వక్తలు కొనియాడారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా విద్యాసంస్థలు, కార్యాలయాల్లో ఆమె చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళా ఉపాధ్యాయులు, అధ్యాపకులను సత్కరించారు. సావిత్రిబాయి సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



శ్రీకాకుళం న్యూకాలనీ: హయాతీనగరంలోని గురుకుల పాఠశాలలో పూలే వేషధారణలో ఉన్న విద్యార్థినులతో ప్రిన్సిపాల్ స్వరాజ్యలక్ష్మి

యూత్ ఫెస్టివల్‌కు వర్సిటీ విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: యువభేరి పేరిట ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఈ నెల 5 నుంచి 9 వరకు సౌత్‌జోన్ యూత్ ఫెస్టివల్ నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొందుకు వర్సిటీ అఫిలియేషన్ పరిధిలో ఐదు కళాశాలల్లో ఎంపిక చేసి వివిధ విద్యా, సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులను ఎంపిక చేశారు. సంగీతం, నృత్యం, థియేటర్ ఆఫ్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, సాహిత్యం, క్విజ్, వ్యాసరచన విభాగాల్లో పాల్గొనే విద్యార్థులు బుధవారం వర్సిటీ అధికారులను కలిశారు. వీరిని ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, అఫిలియేషన్ కళాశాల ఎంపిక కమిటీ సభ్యులు అభినందించారు. యువభేరిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని సూచించారు.



విద్యార్థులతో వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ అడ్డయ్య

నారాయణ యాజమాన్యంపై ఫిర్యాదు

శ్రీకాకుళం: జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్డులో నారాయణ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తమ కుమార్తె సంపతిరావు మేఘన మాధురిని టెన్త్ అయ్యాక కూడా వారి కళాశాలలోనే చేరాలంటూ ప్రతినిధులు ఒత్తిడి తీసుకొస్తున్నారని కుటుంబ సభ్యులు బుధవారం డీఈవో వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులను ఎలాగైనా ఒప్పించాలంటూ మేఘన మాధురితో పాటు మిగిలిన విద్యార్థులను గంటల తరబడి కార్యాలయ గదిలో నిలబెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. మంగళవారం కూడా ఇదేవిధంగా నిలబెట్టగా మేఘన మాధురి నీరసంతో కళ్లుతిరిగి పడిపోయినా పట్టించుకోలేదని, ఈ విషయాన్ని విద్యార్థిని తమకు చెప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి భవిష్యత్తులో పునరావృతం కాకుండా చూడాలని డీఈవోను కోరారు. ఈ విషయమై డీఈఓ వద్ద ప్రస్తావించగా ఫిర్యాదు అందిన వెంటనే పాఠశాల యాజమాన్య ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడానని, విద్యార్థిని కడుపులో తిప్పడం వల్ల కొద్దిసేపు కూర్చుండిపోయిందని చెప్పినట్లు పేర్కొన్నారు. ఫీజు చెల్లించక పోవడంతో ప్రశ్నించడంతో మనసులో పెట్టుకుని ఇటువంటి ఆరోపణలు చేస్తున్నారని చెప్పినట్లు తెలియజేశారు. గురువారం పాఠశాలకు వెళ్లి విచారణ చేపడతానని చెప్పారు. కాగా, ఈ విషయమై పాఠశాల ప్రతినిధులను సంప్రదించేందుకు 'సాక్షి' ఫోన్ చేయగా వారు అందుబాటులోకి రాలేదు.



డీఈవోకు వినతిపత్రం అందిస్తున్న విద్యార్థిని కుటుంబ సభ్యులు



కుమార్తెను హత్యచేసిన తండ్రికి జీవితఖైదు

ఆమదాలవలస/శ్రీకాకుళం పాతబస్టాండ్: కన్న కూతురిని కిరాతకంగా కత్తితో పొడిచి చంపి, భార్యను కూడా హత్యచేసేందుకు ప్రయత్నించిన కేసులో ముద్దాయి కొలుసు రామారావుకు శ్రీకాకుళం మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు జీవితకాలం జైలు శిక్ష, రూ.2500 జరిమానా విధించినట్లు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బుధవారం ప్రకటన విడుదలైంది. ఆమదాలవలస మున్సిపాలిటీ సొట్టవానిపేట, టి.జి.ఆర్.నగర్‌లో గత ఏడాది కొలుసు రామారావు తన కుమార్తెను హత్య చేశాడు. భార్యను చంపడానికి ప్రయత్నించాడు. అప్పట్లో ఆమదాలవలస పోలీసులు కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ ద్వారా సాక్షులను కోర్టులో హాజరుపరిచారు. ఎస్పీ జి.ఆర్. రాధిక పర్యవేక్షణలో ట్రయల్ నడిపి సాక్ష్యాధారాలు రుజువు చేయడంతో నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధించారు. దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన ఆమదాలవలస సీఐ పి.సైదయ్యను, కోర్టు మానిటరింగ్ పోలీసు సిబ్బందిని, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించినారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వే స్టేషన్ సమీపంలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ పోలీసులు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి ఘటన జరిగిందని చెప్పారు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని పేర్కొన్నారు. ఆకుపచ్చని ఫుల్ బనియన్, సిమెంట్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జీఆర్పీ ఎస్సై ఎస్.కె.షరీఫ్ చెప్పారు. వివరాలు తెలిసినవారు జీఆర్‌పీ పోలీసులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఉద్యోగోన్నతి కల్పించాలని వినతి

సరుబుజ్జిలి: గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యానసహాయకులను ఉద్యానశాఖ విస్తరణ అధికారులుగా పదోన్నతి కల్పించేందుకు కృషిచేయాలనిసంబంధిత ఉద్యోగులు కోరారు. ఈ మేరకు బుధవారం పాలవలస కాలనీ వద్ద శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు వినతిపత్రం అందించారు. ప్రతి మండలానికి ఉద్యోగుల కేటాయింపు జరగాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానవనశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుంపల త్రినాథరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి స్వాగత్‌కుమార్ పాల్గొన్నారు.



స్పీకర్ తమ్మినేనికి వినతిపత్రం అందిస్తున్న హార్టికల్చర్ ఉద్యోగులు

ఆల్ ఇండియా టోర్నీకి అంపైర్‌గా శరత్

కవిటి : హైదరాబాద్ ఆర్ఆర్‌సీ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న అండర్-19 ఆల్ ఇండియా షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తుంగాన శరత్ ఎంపికయ్యాడు. ఈ మేరకు రాష్ట్ర సంఘం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు తమరాల జయరాం గురువారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 9 వరకు టోర్నీ జరుగుతుందని చెప్పారు.



తుంగాన శరత్

వైభవంగా పరమపదోత్సవం

మందస: పట్టణంలోని వాసుదేవ పెరుమాళ్ ఆలయంలో శ్రీనమ్మాళ్వార్ల పరమపదోత్సవం బుధవారం రాత్రి వైభవంగా జరిగింది. గోదాదేవి సన్నిధిలోని శ్రీనమ్మాళ్వార్ల ఉత్సవమూర్తితో అర్చకులు ఆలయ పరక్రమణ చేసి, వాసుదేవుని మూలమూర్తి వద్దకు చేర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వానమామలై పీఠం, వసనలవలస తిరుమల రంగనాథం అయ్యవార్లు, సచ్చిదానంద పాఢి పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.



వాసుదేవుని సన్నిధిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గడ్డి లోడు దగ్ధం

కంచిలి: మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో బుధవారం ట్రాక్టర్‌తో తీసుకెళుతున్న ఎండుగడ్డికి విద్యుత్ వైర్లు తాకాయి. దీంతో మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి ఫోన్‌చేయడంతో సిబ్బంది వచ్చి గ్రామస్తుల సహకారంతో మంటలను అదుపుచేశారు.



కాలిపోతున్న గడ్డి

అంగన్వాడీ కార్యకర్తలు మరియు సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి...

1. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు 11 డిమాండ్లతో 12.12.2023 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. మంత్రుల బృందం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మరియు ముఖ్య కార్యదర్శి మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, ఆర్థిక శాఖ వివిధ స్థాయిలలో ప్రభుత్వం అనేక దఫాలుగా చర్చలు చేసిన తరువాత, ప్రభుత్వం కొన్ని డిమాండ్లను అంగీకరించింది, తదనుగుణంగా ప్రభుత్వం G.O లను జారీ చేసింది మరియు అందరికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, కూరగాయల పోపు దినుసులు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ ఖర్చులు మరియు నిర్వహణ ఛార్జీలు విడుదల చెయ్యడం జరిగింది.

a) అంగన్ వాడీ హెల్పర్‌ను అంగన్ వాడీ వర్కర్‌గా పదోన్నతి కల్పించేందుకు వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ 20.12.2023 తేదీన జి.ఓ.ఎం.ఎస్.నెం.44 జారీ చేయబడింది.

b) అంగన్‌వాడీ కార్యకర్తలకు నెలకు ఒకసారి TA/DA మరియు అంగన్‌వాడీ హెల్పర్‌లకు త్రైమాసిక TA/DA క్లెయిమ్ చేయడానికి మెమో నం.2303564/ 2023/ PROG-I-A1, dt.20.12.2023 జారీ చేయబడింది. ఈ ఆదేశాలు జారీ చేసిన తేదీ నుంచి అమలులోకి వస్తాయి.

c) అంగన్‌వాడీ వర్కర్లు & హెల్పర్‌ల కొనసాగింపుకు గరిష్ట వయోపరిమితిని 62 సంవత్సరాలుగా నిర్ణయించి, సేవా ముగింపు ప్రయోజనం రూ.1,00,000/- మరియు రూ.40,000/- అందించడానికి జి.ఓ.ఎం.ఎస్.నెం. 47, తేదీ 20.12.2023 జారీ చేయబడింది.

d) అద్దెలు (Rs 66.54 Crs), పరిపాలనా ఖర్చులు (నీరు & విద్యుత్ ఛార్జీలు, చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి) (Rs.7.81 Crs) మరియు AWCల నిర్వహణ (చిన్న మరమ్మతులు) (రూ. 6.36 Crs) కోసం బడ్జెట్‌లు విడుదల చేయబడ్డాయి.

2. అంతేకాకుండా 2019 నుండి

a) అంగన్ వాడీ వర్కర్ల జీతాలను రూ.11,500/- లకు, మినీ అంగన్ వాడీ జీతాలను రూ.7,000/- కు, అంగన్‌వాడీ హెల్పర్ల జీతాలను రూ.7,000/- కు పెంచింది.

b) 2013 నుంచి అంగన్‌వాడీల కార్యకర్తలకు, సూపర్‌వైజర్లుగా ప్రమోషన్లు ఇవ్వలేదు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ప్రమోషన్లు ఇచ్చి 560 గ్రేడ్- 2 సూపర్ వైజర్ పోస్టులను భర్తీ చేయడం జరిగింది.

c) ఇదే సందర్భంలో ఈ సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్షలు రాసేవారి వయోపరిమితిని 45 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచుతూ వారికి అనుకూల నిర్ణయం తీసుకుంది. దీంతో 9 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న వారిలో ఎక్కువ మంది పోటీపడే అవకాశాన్ని కల్పించడం జరిగింది.

d) అన్నిటికంటే ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలకు అంగన్ వాడీ కార్యకర్తలు, సహాయకులను అర్హులుగా గుర్తించి వారికి డిబిటి ద్వారా రూ.1,313 కోట్లు అందించడం జరిగింది. నవరత్నాలు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ ఆరోగ్య శ్రీ తదితర పథకాలను వారికి వర్తింప చేస్తోంది.

e) ఈ ఏడాది నుంచి అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు జీవిత భీమాను కూడా వర్తింప చేస్తోంది. ప్రమాద బీమాగా రూ. 2 లక్షల వరకూ చెల్లించడం జరుగుతోంది.

f) గర్భవతులకు, బాలింతలకు, పిల్లలకు గతంలో మాదిరిగా వండి ఇచ్చే ఇబ్బంది లేకుండా టేక్ హోమ్ రేషన్ పద్ధతిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. దీనివల్ల వారికి పనిభారం తగ్గడమే కాకుండా పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించే మార్గాలను అంగన్వాడీలకు అందిస్తూ 2023 నుంచి ప్రభుత్వం డ్రై రేషన్ అందిస్తోంది.

3. జాతీయ ఆహార భద్రతా చట్టం (NFSA), 2013 నిర్దేశించిన విధంగా ప్రతి గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లికి బిడ్డ పుట్టిన 6 నెలల వరకు మరియు 7 నెలల నుండి 6 సంవత్సరాల వయస్సు గల ప్రతి బిడ్డకు (పౌష్టికాహార లోపంతో బాధపడే వారితో సహా) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందించడం తప్పనిసరి. వారు సంబంధిత అంగన్ వాడీ సెంటర్లో నమోదు చేసుకున్న లబ్ధిదారులకు అనుబంధ పోషకాహారం అన్ని పని వేళల్లో అందించాలి. ICDS పథకం కింద సప్లిమెంటరీ న్యూట్రిషన్, క్యాలెండర్ సంవత్సరంలో కనీసం 300 లేదా నెలలో సగటున 25 రోజులు అనగా, ఉదయం స్నాక్స్, వేడిగా వండిన భోజనం (HCM) మరియు టేక్ హోమ్ రేషన్‌గా అందించాలి.

4. సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం యొక్క లక్ష్యాలు గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలకు మరియు 3 సంవత్సరాల నుండి 6 సంవత్సరాల పిల్లలకు నిరంతరం పోషకాహార సహాయాన్ని అందజేయడం. AWW లు & AWHలు సమ్మె వలన వారి విధులకు హాజరు కాకపోవడం వలన, పోషకాహార కిట్‌లు, THR మరియు గుడ్లు & పాలు మరియు పంపిణీ చేయబడిన సప్లిమెంటరీ న్యూట్రిషన్ (SNP) లబ్ధిదారులకు లేదు. అంతేకాకుండా, గర్భిణీలు & పాలిచ్చే తల్లులు & 06 నెలలు - 6 సంవత్సరాల పిల్లలను ఆరోగ్య శాఖ ANM సమన్వయంతో అంగన్ వాడీ కేంద్రంలో వివిధ పెరుగుదల/ ఆరోగ్య పారామీతులపై పర్యవేక్షణ జరగటం లేదు.

5. పైన పేర్కొన్న అంశాలదృష్ట్యా, అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే సేవలకు ఆటంకం ఏర్పడినందున, గర్భిణులు & పాలిచ్చే స్త్రీలు, చిన్న పిల్లలు మరియు అణగారిన వర్గాల యొక్క ప్రయోజనాల దృష్ట్యా అంగన్ వాడీ కేంద్రాలలో అందించే సేవలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరియు ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేయడం జరిగింది.

6. పిల్లలకు మరియు గర్భవతులు మరియు బాలింతలకు ఎలాంటి అంతరాయం లేకుండా పోషకాహారాన్ని అందించటానికి, అంగన్‌వాడీ సెంటర్లను నిర్వహించటానికి, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయడానికి, డిడబ్ల్యుసి & విఎస్‌డబ్ల్యుఎస్ (లేదా) సెర్ప్ (లేదా) రెండింటి కలయికతో కూడిన గ్రామ సంస్థల యంత్రాంగాన్ని ఉపయోగించుకుంటున్నాము.

7. కాబినెట్ మంత్రుల గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్య కార్యదర్శి స్థాయి అధికారులు మీతో పలుదఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవలసినదిగా విజ్ఞప్తి చేసియున్నారు. డిపార్టుమెంటు కూడా అందరు అంగన్ వాడీ కార్యకర్తలకు బల్క్ ఎస్.ఎం.ఎస్‌ను పంపించి సమ్మెను విరమించుకోవలసినదిగా కోరటం జరిగింది. ప్రస్తుతం 53.7% గర్భవతులు రక్తహీనతతో వున్నారు. 29.6%, 5 సంవత్సరాలలోపు పిల్లలు బరువు తక్కువగా వున్నారు. 16.1% 5 సంవత్సరాలలోపు పిల్లలు ఎత్తుకు తగిన బరువు లేకుండా (ఎన్.ఎఫ్.హెచ్.ఎస్-5 ప్రకారంగా) వున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన వీరి ఆరోగ్య మరియు పోషణ స్థాయిలు దిగజారి హైరిస్క్ గ్రూప్లో పడే ప్రమాదం వున్నది. మీరు సమ్మె నోటీసు ఇచ్చి ఉన్నారు. దీనిని పురస్కరించుకొని ప్రభుత్వం వారు మీ సంఘము యొక్క సభ్యులతో పలుసార్లు చర్చించి ముఖ్యమైన కోరికలకు ప్రాథమికముగా ఆమోదం తెలిపియున్నారు. ప్రభుత్వం మిగిలిన కోరికలను పరిష్కరించుటకు ప్రయత్నములు చేయుచున్నప్పటికీ, మీరు మీ యొక్క ఉద్యోగ బాధ్యతలను విస్మరించి విధులకు రావటం లేదు. కావున జిల్లా పరిపాలన అధికారిగా మీకు విజ్ఞప్తి చేయడం ఏమనగా మీ న్యాయమైన కోర్కెలన్నీ ప్రభుత్వం పరిష్కరించడానికి కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రభుత్వం చాలా డిమాండ్లను పరిష్కరించిందని గుర్తుంచుకోవలసినదిగా అభ్యర్థిస్తున్నాము. అలాగే ఈ సమ్మె వల్ల బాలింతలు, గర్భిణీ స్త్రీలు, పసిపిల్లలు పౌష్టికాహారం అందక ఇబ్బందులను పడుతున్న విషయాన్ని సహృదయంతో అర్థం చేసుకోవాలని మనవి చేస్తున్నాం. గర్భవతులు మరియు పిల్లల ఆరోగ్య మరియు పోషణ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని సమ్మెను విరమించాలని విజ్ఞప్తి చేస్తున్నాము మరియు జనవరి 5, 2024 లోగా విధులకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఒకవేళ సమ్మె విరమింపచెయ్యని యెడల ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలియచేయటమైనది.

ఇట్లు
కలెక్టర్ మరియు జిల్లా మెజిస్ట్రేట్, శ్రీకాకుళం

విషయ పరిజ్ఞానం అవసరం

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు చదువుతోపాటు విషయపరిజ్ఞానం కూడా ముఖ్యమేనని ఇంటర్మీడియెట్ విద్య డీవీఈవో కోట ప్రకాశరావు అన్నారు. జిల్లాలో ఫిబ్రవరి 11 నుంచి మొదలయ్యే ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు విద్యార్థులను శతశాతం సన్నద్ధం చేయాలని సూచించారు. ఏపీ రాష్ట్ర ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాల మేరకు జిల్లాలో సైన్స్ అధ్యాపకులకు ప్రాక్టికల్స్ పరీక్షలపై జిల్లా ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెండురోజుల ఓరియెంటేషన్ (శిక్షణా సన్నద్ధత) తరగతులు బుధవారం సాయంత్రంతో ముగిశాయి. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర జూనియర్ కళాశాల సెమినార్ హాల్‌లో కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టుల లెక్చరర్లకు ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ప్రిన్సిపాళ్లు, సీనియర్ లెక్చరర్లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ ప్రిన్సిపాల్స్ బి.శ్యామ్‌సుందర్, ఎం.కృష్ణవేణి, కీర్తి తవిటినాయుడు, గుణ సింహాచలం, జి.వెంకటేశ్వరరావు, డి.ఫల్గుణరావు, పీవీఎల్ నారాయణ, వెంకటేశ్వర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిదాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీవీఈవో కె.ప్రకాశరావు

పరిశ్రమల్లో ప్రమాదాలపై అప్రమత్తం

ఎచ్చెర్ల క్యాంపస్: పరిశ్రమల్లో సంభవించే ప్రమాదాల పట్ల అవగాహన కల్పించేలా మాక్ డ్రిల్‌లు నిర్వహించాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాంబాబు సూచించారు. పొన్నాడ స్మార్ట్‌కెం టెక్నాలజీస్ పరిశ్రమలో బుధవారం సిబ్బందితో మాక్ డ్రిల్ నిర్వహించారు. అత్యవసర సమయాల్లో ప్రమాదం నుంచి బయటపడటంపై శిక్షణ ఇచ్చారు. రసాయన పరిశ్రమల్లో విషవాయువులు లీక్‌లు వంటి సమస్యలు ఉంటాయని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా అగ్నిమాపక శాఖ సిబ్బంది హాజరై సిబ్బందికి సూచనలందించారు.



మాక్‌డ్రిల్ పర్యవేక్షిస్తున్న రాంబాబు